www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 22 అక్టోబర్ 2023
5
వైఎస్ఆర్

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 27 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 27 కేసులు పరిష్కరించి రూ.1 కోటి 63 లక్షల 19 వేల పక్షిదారులకు చెల్లించినట్లు ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గరికపాటి దీన బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటిలో బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. మోటారు వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులు, రెవెన్యూ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ మెంబర్స్, కక్షిదారులు వారి న్యాయవాదులతో సంప్రదింపులు చేసి వారి వారి కేసులను పరిష్కరించుకున్నారు. ప్రత్యేక లోక్ అదాలత్ సందర్భంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

గత ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన వరి ధాన్యం ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు రోజు రోజుకూ పెరుగుతూ పుట్టి (8బస్తాలు) రూ. 25వేలకు చేరుకున్నాయి. దిగుబడి మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో మరో వైపు రైతులు ఆందోళన చెందుతున్నారు. డిసెంబర్‌లో వరి నూర్పిడి పనులు చేపట్టిన సమయంలో పుట్టి(8 బస్తాలు) ధర రూ. 12 వేల వరకు పలికాయి. ఆ తర్వాత జనవరి లో రూ.13 వేలకు ధరలు చేరుకున్నాయి. జూన్‌లో రూ.21వేలు పలికి తగ్గుముఖం పట్టాయి. తిరిగి ధరలు పెరిగి ప్రస్తుతం రూ. 24,500 పలుకుతున్నాయి. ప్రస్తుతం నూర్పిడి చేసే ఈ ఖరీఫ్ సీజన్ లో సాగైన వరి ధాన్యం రూ. 16 వేలు పలుకుతున్నాయి.

- ప్రజాశక్తి - చాపాడు

ధర ఘనం.. దిగుబడి శూన్యం

- వరి ధాన్యం ధరలకు రెక్కలు
- పుట్టి రూ. 24,500
- గత ఏడాది ధాన్యం అమ్ముకుంటున్న రైతులు
- కెసికె నీరు విడుదల కాకపోవడంతో తగ్గిన వరి సాగు
- ఇతర పంటలపై మొగ్గు

తగ్గిన వరి సాగు...

ఉమ్మడి కడప జిల్లాలో సాధారణంగా కెసి, కుందూ, బ్రహ్మసాగర్, మైలవరం, గండికోట, పలు చెరువుల కింద వరి పంటను అత్యధికంగా సాగు చేపట్టేవారు. దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు రబీ, ఖరీఫ్ సీజన్‌లలో వరిపంటను సాగు చేసేవారు. దాదాపు లక్ష మంది కౌలురైతులు వరిసాగుపై ఆధారపడి ఉన్నారు. వేలాది మంది వ్యవసాయ కార్మికులు వరిసాగులో పెద్దఎత్తున ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా వరుసగా మూడు సంవత్సరాలు వరిసాగులో నష్టాలు తప్ప, తప్పులాభాలు అనేవి లేకుండా పోయాయి. దీనికి ప్రధానకారణం సరైన మద్దతు ధరలేకపోవడమే. ఎకరా వరి సాగుకు రూ.35 నుంచి రూ. 40వేల వరకు సాగు ఖర్చులు అవుతున్నాయి. పుట్టి వరి ధాన్యం ధర నూర్పిడి సమయంలో రూ. పది వేల లోపు మాత్రమే ఉన్నాయి. 40 బస్తాల దిగుబడి వచ్చినా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు గత ఏడాది వరి సాగును తగ్గించారు. దీంతో క్రమంగా వరి సాగు తగ్గుముఖం పట్టింది. గత ఖరీఫ్‌లో సాగైన వరి ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది వరి సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో ప్రధాన నీటి వనరైన కెసికె నీరు విడుదల కాకపోవడంతో సాగు గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది 80వేల ఎకరాల వరకు సాగు తగ్గింది. దీంతో ఇతర ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. చాపాడు మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా 16 వేల ఎకరాల్లో సాగు అయ్యేది. అలాంటిది ఈ ఏడాది 3400 ఎకరాలకు పరిమితమైంది.

దిగుబడి తగ్గుముఖం...

గత ఏడాది కంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట నిరాశజనకంగా ఉండటంతో దిగుబడి తగ్గే పరిస్థితి నెలకొంది. గత ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 32 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ. 30 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొన్నారు. దిగుబడి పెరగడం, ధరలు ఆశాజనకంగా ఉండడంతో సాగు ఖర్చులు పోను రైతులకు ఆదాయం చేకూరింది. ప్రస్తుతం నూర్పిడి చేసే వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. 2012లో అధిక వర్షాలు, వరద తాకిడికి వరి పంట అధికంగా దెబ్బతింది. వర్షానికి పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.6వేలు నష్టపరిహారం మంజూరైంది. గత ఏడాది ఖరీఫ్ లో సాగు చేసిన లో వరి ధాన్యం ధర రూ. 24 వేలకు పైగా ధర పలుకుతున్నాయి. దీంతో వరి ధాన్యాన్ని నిల్వ ఉంచిన రైతులు అమ్మకాలకు సిద్ధపడుతున్నారు.

వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర..

వరి ధాన్యానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర అందుబాటులో ఉంది. జనవరిలో రూ. 12వేలు ఉన్న పుట్టి ధర ప్రస్తుతం క్రమేపీ పెరిగి రూ.24 వేలకు పైగా పలుకుతున్నాయి. గతంలో రూ. 17వేలకు మించేవి కావు. ధరలు పెరుగుతుండడంతో నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని అమ్ముకాలు చేపడుతున్నాం.

- ఓబుల్‌రెడ్డి, రైతు, పాతపాలెం, మైదుకూరు.

గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు..

వరి ధాన్యానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ధర వచ్చింది. పాత వరి ధాన్యంతో పాటు వేసవిలో సాగు చేసిన వరి ధాన్యం ధరలు కూడా రూ. 24 వేలకు పైగా పలుకుతున్నాయి. గతంలో వరుసగా అధిక వర్షానికి దెబ్బతిన్నడం, సాగు తక్కువ కావడం, ఇతర ప్రాంతాలకు ఎగుమతికి అనుమతి వంటి కారణాలతో ధరలు పెరిగినట్లు తెలుస్తుంది.

- సుబ్బరాయుడు ,వరి ధాన్యం వ్యాపారి, చాపాడు.

వరి ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న కూలీలు

పోలీసుల సేవలు అజరామరం

- జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి దీనబాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం విధుల్లో ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు వెలకట్ట లేనివని నాల్గవ జిల్లా అదనపు న్యాయ మూర్తి, జిల్లా ఇన్‌ఛార్జి న్యాయమూర్తి దీన బాబు కొనియాడారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించే క్రమంలో ప్రాణాలు సైతం అర్పించారని పేర్కొన్నారు. శనివారం నగరంలోని పోలీసు పెరేడ్ మైదానంలో నిర్వ హించిన స్మృతి పెరేడ్‌కు ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ పాటు, జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి దీనా బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా వారు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ పోలీసు యూనిఫార్మ్‌కు సమాజంలో అత్యంత గౌరవం ఉందన్నారు. పోలీసు శాఖలో విధులు సంక్లిష్టంగా ఉంటాయన్నారు. దేశానికి సైనికులు, పోలీసు వ్యవస్థ రెండు కళ్ల వంటివని, కళ్ళు బాగున్నపుడే సమాజం సురక్షితంగా ఉంటుందన్నారు. సైనికులు దేశ సరిహద్దుల్లో, పోలీసులు దేశంలోని అంతర్గత శాంతిభద్రతల సంరక్షణకై పోరాడుతూ ప్రజలు ప్రశాంతంగా జీవించేలా కషి చేస్తున్నారన్నారు కరోనా సమయంలో ప్రజలను కట్టడి చేసి వారి ప్రాణాలను కాపాడారన్నారు. దేశంలో తమ బాధ్యతను నెరవేర్చే క్రమంలో 38 వేల మంది పోలీసులు ప్రాణాలు అర్పించారన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాదిలో జిల్లాలో ఆరుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. అందించిన సేవలకు పోలీసు శాఖ ఎప్పటికి రుణపడి ఉంటుందన్నారు. వారి కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా లో విధినిర్వహణలో అమరులైన పోలీసు, హోమ్ గార్డుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు.

ఆయుధాలను పరిశీలిస్తున్న ప్రధాన న్యాయమూర్తి దీనబాబు

పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసు శాఖ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, సాధించిన విజయాలకు సంబంధించిన ఛాయా చిత్రాలతో కూడిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ ఒక్కో ఛాయా చిత్రానికి సంబంధించి వివరాలను విశదీకరించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, సామాగ్రి ప్రదర్శన 'ఓపెన్ హౌస్' ఏర్పాటు చేశారు ప్రదర్శనలో నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్ స్క్వాడ్ బందంలో ఇటీవల నూతనంగా చేరిన దయానా, రూబీ లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎస్‌పి జాగిలాల గురించి జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తికి వివరించారు. నేర పరిశోధనలో, విఐపి ల రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్.పి(అడ్మిన్) తుషార్ డూడి, స్పెషల్ ఎన్‌ఫోర్సు మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ప్రవీణ్ కుమార్, ఏ.ఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్ .ఎస్.వి కష్ణారావు, ఎఆర్‌డిఎస్‌పి రమణయ్య, డిఎస్‌పి బాలస్వామి రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి, ఆర్‌ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, శ్రీశైలరెడ్డి, ఆనంద్, నగరంలోని సి.ఐ లు, ఎస్‌ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, అసోసియేషన్ సభ్యులు, అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజిలెన్స్ దాడులు

బంగారు దుకాణాలు మూసేసిన వ్యాపారులు
లెక్కలు చూపని కిలోలకొద్దీ బంగారం గుర్తింపు

మూతబడిన బంగారు అంగళ్లు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు బంగారు దుకాణాలపై ఆదాయ పన్ను శాఖ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం నుంచి ఈ దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. విషయం జిల్లా వ్యాప్తంగానే కాక రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఎవరినికీ లోనికి అనుమతించకుండా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సరైన పత్రాలు బిల్లులు లేని పన్ను చెల్లించని కిలోల కొద్ది బంగారం నగలు పెద్దమొత్తంలో అధికారులు గుర్తించారు. బంగారు వ్యాపారంలో రెండవ ముంబాయిగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో నిత్యం జీరో వ్యాపారం రూ.కోట్లల్లో జరుగుతున్న విషయం తెలిసిందే. స్థానిక అధికారులు అడపా దడపా దాడులు చేసినప్పటికీ సత్ఫలితాలివ్వలేదు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్ల రూపాయల ఎగ్గొట్టడంతో అధికారులు దాడులకు శ్రీకారం చుట్టారు. బంగారు వ్యాపారంలో అగ్రగామిగా పేరుగాంచిన బుశెట్టి రామ్మోహన్‌ను కేంద్రంగా చేసుకొని వారి బంధువుల అంగళ్లలో ఇతరత్రా ప్రముఖంగా వ్యాపారం చేసే వారిపై తనిఖీల పరంపర కొనసాగుతోంది. స్థానిక బంగారు వ్యాపారస్తులపై సుమారు నాలుగు నెలలుగా అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం. బంగారు కొనగోలుదారులుగా వచ్చి బంగారు కొన్నట్లుగా తెలిసింది. వీరు కొన్నబంగారుకు బిల్లులు ఇవ్వలేదని సమాచారం. దసరా పండుగవేళ అయితే అమ్మకాలు కొనుగోలు భారీగా జరుగుతాయని అంచనా వేసి దాడులు చేపట్టారు. దాడులు ఆదివారం కూడాజరుతుతాయని సమాచారం. సుమారు 40 మంది అధికారులు కేంద్ర బలగాల రక్షణతో సోదాలు చేపట్టారు. ప్రొద్దుటూరులో ఎక్కడా చూసినా ఈ దాడుల గురించే ప్రధాన చర్చనీయాంశమైంది. దాడుల నేపథ్యంలో బంగారు అంగళ్లు దాదాపుగా మూసివేశారు. వ్యాపారుల వద్ద లెక్కలు చూపని కిలోల కొద్ది బంగారు దొరికిందని వ్యాపారుల స్థిర చరాస్థులను కూడా అధికారుల సీజ్ చేశారని చర్చోపచర్చలు సాగుతున్నాయి. అదికారులు మాత్రం ఎలాంటి సమాచారం బయటకు పొక్కకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

గర్జన

ప్రజాదృష్టి

కృష్ణాజలాల పున:పంపిణీ తలంపే అక్రమమనే నినాదం మార్మోగిపోయింది. జిల్లాలోని వైఎస్ఆర్ ఆడిటోరి యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, బిజెపి, వైసిపి మినహా మిగిలిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాలు పెద్దఎత్తున గర్జిం చడం తెలిసిందే. కర్నాటక, తెలంగాణలో ఎన్నికల అవసరాల నేపథ్యంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా రాజకీయ అవసరాల కోసం కేంద్రంలోని బిజెపి సర్కారు దిగువ రాష్ట్రాల ప్రజల జీవి తాలతో చెలగాట మాడుతోందని చెప్పవచ్చు. కృష్ణాజలాలను ఎపి, తెలంగాణ మధ్య పంపిణీ చేయాలని కేబినెట్ ఆమోదం తెలపడాన్ని చూడాల్సి ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజకీయ, వ్యక్తిగత స్వార్థానికిలోనై సమర్థంగా వ్యవహరించడం లేదనే వాదన తర్కానికి నిలుస్తోంది. ఇటువంటి తీవ్రమైన విమర్శల నేపథ్యంలో ముఖ్యమంత్రి సమర్థంగా వ్యవహరించడం ద్వారా రాష్ట్ర ప్రజల తరుపున నిలబడి స్వచ్ఛతను నిరూపణ చేసుకోవాల్సి ఉంది. లేనిపక్షంలో చరిత్ర హీనుడిగా నిలిచిపోతారనే విమర్శ సాకారమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మేల్కోవాల నడంలో సందేహం లేదు. కృష్ణా పరీవాహక ప్రాంతం పరిధిలో కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉండగా, నలుగురి మధ్య కృష్ణాజలాలను పంపిణీ చేయాలి. కానీ ఎపి, తెలంగాణ మధ్య పంపిణీ చేయాలని పేర్కొంటూ కేబినెట్ ఆమోదించడం, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఆదేశించడం చక చకా జరిగిపోయింది. ఎపి, తెలంగాణ రాష్ట్రాల మధ్యే కృష్ణా జలా లను పంపిణీ చేయడం అశాస్త్రీయమని, రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందనే ఆందో ళన వ్యక్తమైంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రైపేరియన్ రైట్స్ కింద రాష్ట్రానికి కేటా యించాల్సిన అదనపు జలాలతోపాటు నికర జలాలు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందనే వాదన గట్టిగా విని పిస్తోంది. తెలంగాణ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై స్టే తెచ్చుకోగా, దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతానికి సంబంధించిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఎం దుకు స్టే తేవడానికి ఎందుకు ప్రయత్నించలేదని నిలదీశారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎదుట లొంగిపోవడం వల్లే రాయలసీమకు అన్యాయం జరుగుతోందని, రాయలసీమ ద్రోహిగా మిగిలి పోయాతారని ఆక్రోశించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ పుట్టినగడ్డ రాయలసీమకు అన్యాయం జరుగుతుండగా, తమ రాజకీయ, వ్యక్తిగత స్వార్థ ప్రలోభాలకులోనై రాయలసీమకు, రాష్ట్రానికి అన్యాయం చేయడం దారుణమనే వాదన వినిపించింది. రాష్ట్రంలోని ఎందరో సీనియర్ అధికారులకు తెలిసినప్పటికీ, సంబంధం లేని వేదికలను ఉద్దేశపూర్వకంగా ఆశ్రయిస్తూ, రాష్ట్రానికి, ముఖ్యంగా రాయలసీమకు అన్యాయం చేస్తున్నారనే వాదన ముక్తకంఠంతో వినిపించింది. కృష్ణాజలాల పున:పంపిణీ చేయాలని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో రాష్ట్రంలోని అఖిల పక్షాలను పిలిచి, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించకపోవడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అనంతరం అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి ఎదుటకు తీసుకెళ్లడమా, లేక సుప్రీంకోర్టును ఆశ్రయించడమా అనే అంశంపై సంప్ర దింపులు చేయకుండా తీసుకెళ్లకపోవడంలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్రంలోని భవిష్యత్ తరాలు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన గురుతరమైన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు రాయలసీమ వ్యాప్తంగా కృష్ణా జలాల పున:పంపిణీ అంశాన్ని చర్చనీయాంశం చేయాల్సిన అవ సరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై స్పష్టమైన ఎజెండాతో ముం దుకు కదలాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీనికి తుదిరూపు ఇచ్చే ఎజెండాకు రూపకల్పన చేసి, పార్టీల ఎదుట ఉంచుతామని సిపిఎం స్పష్టం చేయడం గమనార్హం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కృష్ణాజలాల పున:పంపిణీపై రాజ కీయ, న్యాయపరమైన పోరాటాలు ఏ రూపుతీసుకుంటాయో వేచి చూడాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

దాడులు ఆపి.. శాంతిని నెలకొల్పాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఆపి శాంతిని నెలకొల్పాలని ముస్లిమ్ మతపెద్దలు, ప్రజా సంఘాల నాయకులు పిలు పునిచ్చారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ నగరంలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో శనివారం శాంతియుత భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నబికోట నుంచి ప్రారంభమై పాతబస్టాండ్, నాగారాజుపేట, ఎన్‌టిఆర్ సర్కిల్ మీదుగా ఏడు రోడ్ల కూడలికి చేరుకుంది. ర్యాలీలో భారతదేశ జాతీయ జెండాతో పాటు పాలస్తీనా జాతీయ జెండా రెపరెపలాడాయి. భారత ప్రభుత్వం పాలస్తీనాకు మద్దతు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఏడు రోడ్ల వద్ద ర్యాలీని ఉద్దేశించి సలావుద్దీన్, అమీర్‌బాబు, చంద్రశేఖర్, ఈశ్వరయ్య, మత పెద్దలు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి చొరవ తీసుకుని దాడులను ఆపాలని కోరారు. ఇప్పటికే 5వేల మంది అమాయక ప్రజలు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ర్యాలీలో సంఘసేవకులు సయ్యద్ సలావుద్దీన్, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, టిడిపి కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ అమీర్‌బాబు, టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, జమీల్, నాసర్ అలీ, సిపిఐ రాష్ట్ర నాయకులు ఈశ్వరయ్య, రాజకీయ పార్టీలు, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, మతగురువు జాకీర్ హుస్సేన్, అలీఖాన్, మగ్బుల్ బాష, కార్పొరేటర్ షఫి, జెకె యూత్ ఖాదర్‌బాష, మాజీ కార్పొరేటర్ జమాల్ వలి, మతపెద్దలు పాల్గొన్నారు.

కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు, ప్రజాసంఘాల నాయకులు

నిలువు దోపిడీ చేస్తున్న థియేటర్లు

కడప అర్బన్ : జిల్లాలో వినోదం పేరుతో సినిమాకు వచ్చే ప్రేక్షకులను సినిమా థియేటర్ల యజమాన్యాలు నిలువు దోపిడి చేస్తున్నాయని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లా లో సినిమా థియేటర్ల యాజమన్యాలు ప్రభుత్వ నిబందనలు పాటించడం లేదని తెలిపారు. పార్కింగ్ ఫీజు వసూలు చేయవద్దని ప్రభుత్వం చెబుతున్నా పట్టించుకోకుండా అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. థియేటర్లలో తిను బండారాల పేరుతో అధిక రేట్లకు ప్రేక్షకుడి జేబుకు చిల్లు పెడుతున్నారన్నారు. కొత్త సినిమా విడుదల అయితే అధిక రేట్లకు టికెట్ల అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. సామాన్యుడు కుటుంబంతో వినోదం కోసం సినిమాకు రావాలంటే అధిక రేట్లకు భయపడి రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు థియేటర్ల యజమాన్యలపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

కడప : వైసిపి ప్రవేశపెట్టిన జిపిఎస్ (గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్)ను రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు .జిపిఎస్‌తో ఉద్యోగస్తులు సంతృప్తిగా లేరని పేర్కొన్నారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చాక ఒక మాట చెప్పడం జగన్మోహన్‌రెడ్డికే చెల్లిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలియజేశారు. పాత పెన్షన్ పాలసీకే కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో పాత పెన్షన్ పాలసీ అమల్లో ఉందన్నారు. రాబోయే ఎలక్షన్లలో వైసిపికి ఉద్యోగస్తులు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

చెన్నూరు : మండలంలోని శివాలపల్లి గ్రామ పంచాయతీలోని దళితవాడకు చెందిన వల్లూరు చెన్నమ్మ (85) అనే వృద్ధురాలు మృతి చెందింది. ఈ సమాచారాన్ని శివాలపల్లి గ్రామ సర్పంచ్ ముమ్మడి సుదర్శన్ రెడ్డి వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్ర ప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ పోచమరెడ్డి ఛా రిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 5 వే ఆర్థిక సాయం అందజేశారు.

ఎంపీ అవినాష్‌కు కృతజ్ఞతలు

కడప : బుడగజంగాలను ఎస్‌సిలో కలిపేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం చాలా సంతోషించదగ్గ విషయమని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి, మోతే పెద్ద జమయ్య అన్నారు. శనివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో వారు మర్యాద పూర్వకంగా కలిసి చాలు వాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి బేడా బుడగ జంగం వారిని ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర కేబినెట్ లో ఎస్‌సి జాబితాలో చేర్చి కేంద్రానికి పంపడం అభినందనీయమన్నారు.

రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు

కడప : 48 డివిజన్ కృపా కాలనీలో రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. గతంలో కాలనీ సమస్యలను తీర్చాలని స్పందనలో కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్‌ను న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్ విన్నవించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం కృపా కాలనీని మున్సిపల్ అధికారులు ఓఇ నాగార్జున, రామరాజుపల్లి సచివాలయం ఏమినిటీస్ సెక్రెటరీలు ప్రకాష్, రోశయ్య పరిశీలించి చిప్స్ రోడ్డుకు ప్రతిపాదన సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ పాల్గొన్నారు.

ఆర్‌డిగా రత్నకుమారి బాధ్యతల స్వీకరణ

కడప అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీగా డాక్టర్ రత్నకుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమెను మర్యాద పూర్వకంగా మినిస్ట్రీయల్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. రమేష్ కుమార్, నాయకులు సత్యనారాయణ, రాజశేఖర్, గోపాల్ రెడ్డి కలిశారు. పూల బొకే అందజేశారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కడప అర్బన్ : పాత పెన్షన్ విధానములు చేయాలని ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. శనివారం జడ్‌పి ఆవరణలో ధర్మ పోస్టర్ ఆవిష్కరించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 29 న విజయవాడ లో ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జిపిఎస్‌కు వ్యతిరేకంగా, 117 జీవో రద్దుకు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగభూషణం, నరసింహులు పాల్గొన్నారు.

కడప జట్టుపై చిత్తూరు విజయం

కడప : కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మ్యాచ్‌లో కడప జట్టుపై 10 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్ లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 296 పరుగులు చేసింది. 6 వికెట్ల నష్టానికి 387 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 55.1 ఓవర్లలో 484 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని నికిత్ గౌడ్ 99, లోహిత్ 75 పరుగులు చేశారు. కడప జట్టులోని షేక్ ఆసిఫ్ హుస్సేన్ 4, షేక్ ఆదిల్ హుస్సేన్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 55.1 ఓవర్లలో 216 పరుగులకు ఆల్ అవుట్ అయింది. రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 4.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 29 పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.



టిడిపి రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో శ్రీనివాసరెడ్డి

ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుదాం : మాజీ ఎమ్మెల్సీ

కడప అర్బన్ : రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం చూపుతున్న నిరంకుశ మొండివైఖరి దుర్మార్గమని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర మాజీప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఎస్‌టియు రాష్ట్ర సంఘ పిలుపు మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట జిల్లా శాఖ అధ్యక్షుడు పి.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆక్రందన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన చెల్లించాల్సిన జీతాలు, పెన్షన్లు ఎప్పుడు పడతాయో కూడా తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొనడం బాధాకరమన్నారు. సకాలంలో జీతాలు అందక సగటు వేతనజీవులు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలగంగిరెడ్డి పాల్గొన్నారు.

చందాలు వేసుకొని బోరుకు మరమ్మతు

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని దళితవాడ వాసులు చందాలు వేసుకుని స్వయంగా చేతి పంపుకు సంబంధించిన బోరును మరమ్మతులు చేయించుకున్నారు. ఈ బోరు నీరు దళితవాడ ప్రజలేగాక బిసి కాలనీ, మరికొందరికి ఉపయోగపడుతుంది. శుక్రవారం ఉదయం చెడిపోవడంతో దళితవాడ ప్రజలు నీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరైన సమయానికి ఊర్లోని మోటారు నీళ్ల కూడా సక్రమంగా రాకపోవడంతో చాలా అవస్థలు పడ్డారు. మరమ్మతు కోసం పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. అయన సక్రమంగా స్పందించకపోవడంతో చేసేదేమీ లేక గ్రామస్తులే చందాలు వేసుకుని ప్రయివేట్ మెకానిక్‌ను పిలిపించి బోరును మరమ్మతు చేయించారు. పంచాయతీలో తాగునీటి బోరు చెడిపోతే పట్టించుకునే వారే లేరని దళితవాడ ప్రజలు వాపోయారు. ఈ విషయంపై ఇఒపిఆర్‌డిని ప్రశ్నించగా ఆయన పొంతన లేని సమాధానం ఇవ్వడం శోచనీయం.



బోరును మరమ్మతు చేయించుకుంటున్న గ్రామస్తులు

సత్ప్రవర్తనతో మెలగాలి : జడ్జి భార్గవి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి భార్గవి అన్నారు. సబ్ జైల్‌లోని ఖైదీలకు శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ లోక్ అదాలత్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటి ద్వారా కేసులు రాజీ మార్గాన పరిష్కరించుకోవచ్చన్నారు. 498ఎ, మోటర్ బైక్ ప్రమాదాల గురించి వివరించారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్, న్యాయవాది పాలాజి రవి, జైల్, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి భార్గవి

మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు కరిముల్లా

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి సూచించారు. చాపాడు శాఖా గ్రంథాలయంలో శనివారం దసరా సెలవులలో విద్యార్థులకు పుస్తక పఠనంపై వివరించారు. జనరల్ నాలెడ్జ్, తెలుగు బాషపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు కరిముల్లా విద్యార్థులకు పలు అంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళులు

ప్రజాశక్తి - కొండాపురం

పోలీసు అమరవీరుల దినోత్సవ సందర్భంగా శనివారం కొండాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఎస్ఐలు యోగేంద్ర, మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ వేణుగోపాల్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం, ప్రజారక్షణ కోసం పోలీస్ విధులను నిర్వహిస్తూ తమ ప్రాణాలను సైతం అడ్డుపెట్టి ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు ఎంతో రుణపడి ఉన్నామన్నారు. వారు చూపిన బాటలోనే ప్రతి పోలీసు నడుచుకోవాలని సూచించారు. అవసరమైన చోట ప్రాణాలను సైతం అడ్డుపెట్టి దేశ రక్షణ బాధ్యతను చేపట్టాలని ఆయన పోలీసులకు సూచించారు. సమాజంలో పోలీసుల పాత్ర కీలకమైందన్నారు. ప్రజలతో పోలీసులు గౌరవ మర్యాదలతో నడుచుకోవాలని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీస్ అనే పిలిపించుకోవాలని సిఐ వివరించారు.

మాట్లాడుతున్న సిఐ వేణుగోపాల్

పూర్తయిన రోడ్డు..

- తీరిన పలు గ్రామాల ప్రజల కష్టాలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని పెన్నా నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న టి.కోడూరు, ఎర్రగుడి, చామలూరు, సంకేపల్లి, కొత్తపల్లి, శిరిగేపల్లి, మురగంపల్లి, దబ్బుడుపల్లి, రాగికుంట గ్రామాలకు జాతీయ రహదారి నుండి సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను ఆయా గ్రామాల ప్రజలు స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందిన ఎమ్మెల్యే, ఎంపీ ప్రజల సమస్యలను వెంటనే ఉన్నతాధికారులకు తెలిపారు. వంగనూరు (పెన్నానది వద్ద) నుండి టి.కోడూరు వరకు 2.6 కిలోమీటర్ల పనిని రూ.1.18 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించారు. కాంట్రాక్ట్ అనుమతులు అందుకున్న కాంట్రాక్టర్ కోడూరు వైసిపి సీనియర్ నాయకుడు ఎన్.రామసుబ్బారెడ్డి పనులు ప్రారంభించి, రెండు నెలల కాలంలోనే పూర్తి చేయించారు. తారు రోడ్డు నిర్మాణం పనులు వేగంగా పూర్తి కావడంతో స్థానిక ప్రజలు కాంట్రాక్టర్‌ను అభినందించారు. చాలా కాలంగా తమను వేధిస్తున్న సమస్యను అనతికాలంలోనే పరిష్కరించినందుకు ఆయా గ్రామాల ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తయిన తారు రోడ్డు నిర్మాణం (ఇన్‌సెట్‌లో) కాంట్రాక్టర్ ఎన్.రామసుబ్బారెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నాగులపల్లె పెట్రోల్ బంక్ సమీపంలో మైదుకూరు రోడ్డు వైపున శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు రోడ్డు పక్కన ఉండగా గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై, అక్కడికక్కడే తీవ్ర మృతి చెందింది. మృతురాలు వివరాలు తెలియలేదు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారమివ్వాలని ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పత్తూరులో చోరీ..

- ఆభరణాలు, నగదు అపహరణ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పత్తూరు దళితవాడలో నివాసముండే జంపాల విమలమ్మ ఇంట్లో చోరీ జరిగింది. ఈ చోరీ ఘటనలో దాదాపు రూ.80వేలు నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. శనివారం చోరీ జరిగిన నివాసాన్ని మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 14న విమలమ్మ తన కుమారుని ఇంటికి వెళ్లడంతో చోరీ జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. చోరీ ఘటనలో రెండు తులాల బంగారు చైను కూడా అపహరణకు గురైందన్నారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

వర్షాభావంలోనూ పెరిగిన రబీ సాగు

12 వేల ఎకరాలకు పైగా ఆరుతడి పంటలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో ఈ ఏడాది రబీ సాగు గతంలో కంటే అత్యధికంగా సాగైంది. చాపాడు మండల పరిధిలో ప్రతి ఏడాది సకాలంలో కేసీ కెనాల్‌కు ఖరీఫ్ సీజన్‌కు నీరు వస్తే 14 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు అయ్యేవి. రబీ సీజన్‌లో కేవలం 4వేల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు అయ్యేవి. అయితే ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కేసీ కెనాల్‌కు ఖరీఫ్ సీజన్‌లో నీరు విడుదల కాలేదు. దీంతో బోరుబావులు, కుందూ, పెన్నా పరిధిలోని కొన్ని గ్రామాల్లో మాత్రమే సాధారణంగా రైతులు 2,700 ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. కేసీ కెనాల్ పరిధిలో పూర్తిగా రబీ సీజన్ ప్రారంభమైన తర్వాత మినుము, పెసర, జొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను రైతులు సాగు చేపట్టారు. ఇప్పటివరకు సుమారుగా 11 వేల ఎకరాలకు పైగా ఆరుతడి పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు. ఇంకా మూడు వేల ఎకరాలలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. వేరుశనగ సాగు చేసే రైతులు కాస్త ఆలస్యంగా సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం వారం రోజులుగా కేసీ కాలువకు నీరు విడుదల కావడంతో ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు పంటకు నీరు వేస్తున్నారు. ప్రభుత్వం ఆరుతడి పంటల సాగుకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు మంజూరు. చేయకపోవడంతో నంద్యాల, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల నుండి మినుము, జొన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేసుకుని సాగు చేపడుతున్నారు. ఎరువులు మాత్రం ఆర్‌బికె, ప్రైవేట్ దుకాణాల్లో అందుబాటులో ఉండడంతో రైతులు సేకరించుకొని ఆరుతడి పంటలకు వినియోగిస్తున్నారు.

బద్రిపల్లె వద్ద వేరుశనగ సాగు చేస్తున్న రైతులు

ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి : ఎమ్మెల్యే

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం

ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్నదే సిఎం జగన్ ఉద్దేశమన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కేవలం జగన్మోహనరెడ్డి ప్రభుత్వం మాత్రమే చేస్తోందన్నారు. శిబిరంలో డాక్టర్లు సుజాత, జయంతి, స్పెషలిస్టులు విజయకుమార్, మహేష్ వైద్యసేవలు అందిచారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా సంఘం చైర్మన్ ఒంటెద్దు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ వెంగల జగదీశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కె.వై. చంద్రశేఖర్‌రెడ్డి, చింతా నవజ్యోతిరెడ్డి, రేగడిపల్లి నాగేశ్వరరెడ్డి, తిమ్మాపురం శేఖర్, సూర్యనారాయణరెడ్డి, సోమశేఖరరెడ్డి, బుజ్జి, డి.దామోదర్ రెడ్డి. కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఇంటి వద్దనే చేపట్టిన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి లక్ష్మి గాయత్రి కోరారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి జగనన్న వైద్య సురక్ష శిబిరాన్ని పరిశీలించారు. రోగులను వైద్య పరీక్షలపై అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలించి, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. బాల్య వివాహాలు చేయడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ స్వాతిసాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఎంపిటిసిలు భారతి, కటిక చంద్రశేఖర్, వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, ఘాకురు, మినరల్ డైరెక్టర్ సల్మా, సచివాలయం కన్వీనర్ బ్రహయ్య, రమేష్, మణి గోపాల్‌రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న మినరల్ డైరెక్టర్ సల్మా

విద్యార్థులు క్రీడల్లో గుర్తింపు పొందాలి

క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్తులు ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి విలు విద్య పోటీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ వేంపల్లెలో రాష్ట్రస్థాయి విలు విద్య పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇలాంటి క్రీడలు జరిగే సమయంలో విద్యార్థులను కూడా ఆహ్వానించాలని కోరారు. విలు విద్య అనేది చాలా కష్టంగా ఉంటుందన్నారు. అయితే లక్ష్యం దిశగా విద్యార్థులు దృష్టి పెడితే కష్టం అనేది కనపడదని ఆయన సూచించారు. విలు విద్యలో వేంపల్లె విద్యార్థులు రాణించి గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడ విలు విద్య అన్నారు. విలు విద్యకు ఏకాగ్రత, బలం, సంకల్పం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మిగాయిత్రి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి భారతి, వార్డు మెంబర్ ముత్యాల ఆంజనేయులు, మణి గోపాల్‌రెడ్డి, చెరుకూరి సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ గురుప్రసాద్, కుమ్మరాంపల్లె సర్పంచ్ మునేష్, నాయకులు పాల్గొన్నారు.

అనుసంధాన రోడ్డుకు మోక్షమెన్నడో..!

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ- చియ్యపాడు గ్రామాల మధ్యన ఉన్న అనుసంధాన గ్రావెల్ రోడ్డు అధ్వానంగా ఉంది. నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్య పంట పొలాల్లో ఉన్న రహదారి గుంతలమయంగా మారి రైతులకు ఇబ్బందికరంగా ఉంది. పంట పొలాలకు ఎరువులు తరలించడం, ధాన్యాన్ని ఇంటికి తరలించేందుకు ఈ మార్గాన రైతులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఈ మార్గానికి మరమ్మతులు చేపడితే చాపాడుకు నెర్రవాడ నుంచి తక్కువ సమయంలో వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. చియ్యపాడు, బద్రిపల్లె, నెర్రవాడ గ్రామాల రైతులకు ఈ మార్గంలో పంట పొలాలు ఉన్నాయి. వరి, పసుపు, మెక్కజొన్న, దోస వంటి పంటలు ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ రహదారికి అనుసంధానంగా తిరిగి పంట పొలాలకు వెళ్లే అడ్డరోడ్లు రెండు ఉన్నాయి. 500 ఎకరాలకుపైగా ఈ రోడ్డు పరిధిలో పంట పొలాలు ఉన్నాయి. ఈ మార్గంలో రెండు ప్రదేశాలలో నీరు ప్రవహిస్తూ రోడ్డు అధ్వానంగా తయారైంది. మిగిలిన ప్రాంతంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు ప్రయాణించేందుకు అసౌకర్యంగా మారింది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడితే అటు రైతులకు ఇటు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

అధ్వానంగా ఉన్న నెర్రవాడ-చియ్యపాడు రోడ్డు

భవనాలను పూర్తిగా తొలగించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని మాచుపల్లెరోడ్డులో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అరకొరగా తొగింపు వల్ల అసాంఘిక కార్యకలాపాలు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజికుంట కాలనీ వద్ద అసంపూర్తిగా తొలగించిన షాపులు ఎప్పుడు పడిపోతాయో అన్న ఆందోళన చెందుతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో గోడలను కూల్చివేయాలని కోరుతున్నారు.

ప్రాంతీయ అస్తిత్వానికి అద్దం పట్టే కావ్యం 'పెన్నేటిపాట'

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమ రైతుల బాధామయ జీవన చిత్రణను, పెన్నేటి ప్రాంత కన్నీటిగాథను వర్ణిస్తూ విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటిపాట' కావ్యం ప్రాంతీయ అస్తిత్వానికి అద్దం పట్టేలా ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం ప్రసిద్ధకవి, సంపాదకులు విద్వాన్ విశ్వం 109వ జయంతిని, కవి, విమర్శకులు రూపనగుడి నారాయణరావు 143వ జయంతిని నిర్వహించారు. ముందుగా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి విద్వాన్ విశ్వం, నారాయణరావు చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్వాన్ విశ్వం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే రచన 'పెన్నేటిపాట' అని అన్నారు. ఈ కావ్యంలో ఆయన రాయలసీమ వాస్తవికతను చిత్రిస్తూ రాయలసీమ గత వైభవాన్ని రేఖామాత్రంగా పేర్కొని, ప్రస్తుతం ఇది వట్టి ఎడారి అని, పెన్నానది నీరులేక పీనుగుల పెన్నగా మారిందని ఆవేదనతో అన్నారన్నారు కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ మౌనిక, సిబ్బంది కుళ్ళాయిబాబు పాఠకులు బాలరాజేశ్వర రెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం

కడప : ప్రతి ఒక్కరికి ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలని, దీనివల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు యదుభూషణ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందికి శాశ్వత లోక్ అదాలత్ గురించి కలెక్టరేట్‌లో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ ప్రసాద్ మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమని అన్నారు. శాశ్వత లోక్ అదాలత్ (పిఎల్‌ఎ) ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం లభిస్తుందని చెప్పారు. 'శాశ్వత లోక్ అదాలత్' అనే వ్యవస్థ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదాన్ని ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా పరిష్కరిస్తుందని తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణంలో ఉన్న ఈ వ్యవస్థ రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టానికి లోబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వంచే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు యదు భూషణ రెడ్డి, కార్యాలయపు సిబ్బంది, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలందరూ విద్యనభ్యసించాలి : డిఇఒ

కడప అర్బన్ : బడిఈడు పిల్లలందరూ బడిలో చేరి విద్యనభ్యసించాలని డిఇఒ రాఘవరెడ్డి అన్నారు. శనివారం బడి బయట పిల్లలపై స్పెషల్ డ్రైవ్ 2వ రోజు నిర్వహించారు. 8 నుంచి 9వ తరగతికి వచ్చిన విద్యార్థులపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాల మేరకు కడప అర్బన్ ప్రాంతంలో గత ఏడాది 8వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు అనేక కారణాల వల్ల బడికి 9వ తరగతిలో చేరకపోవడాన్ని గమనించామని తెలిపారు. అందులో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని పేర్కొన్నారు. విద్యార్థులు బడిలో చేరేలా ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు.

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో భూపేష్, ఉక్కు ప్రవీణ్

గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రజలలోకి వెళ్లాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సూచించినట్లు జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. శనివారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో విస్తృతస్థాయి రాష్ట్ర పార్టీ సమావేశం జరిగిందని, అందుకు జమ్మలమడుగు నుంచి తనతోపాటు రాష్ట్ర కార్యదర్శి జాంబపురం రమణారెడ్డి కలిసి వెళ్లామన్నారు. లోకేష్‌తోపాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రతి నియోజకవర్గంలో అభ్యర్థితోపాటు రాజకీయ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో పనిచేయాలన్నారన్నారు. చంద్రబాబు విజన్‌ను, ఆయనను అక్రమంగా అరెస్ట్ చేసిన విధానాన్ని ప్రజలలోకి బలంగా తీసుకుపోవాలని తెలిపారన్నారు. ప్రతి గ్రామ కార్యకర్త టిడిపి గెలుపునకు కృషి చేయాలన్నారు. తనతోపాటు బద్వేల్ యువనాయకులు రితేష్ రెడ్డి, ప్రొద్దటూరు ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారని ఆయన తెలపారు.

దాతలకు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని ఇస్తున్న అసిస్టెంట్ కమిషనర్

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - చక్రాయిపేట

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి తొండూరు గ్రామానికి చెందిన ఆడికె రామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు ఆడికె నాగేశ్వరరెడ్డి (డిఆర్‌డిఎల్ సైంటిస్ట్) ధర్మపత్ని మంజుల, వీరి కుమారుడు ప్రణీత్ కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు రూ.2,00,116 విరాళం అందజేశారు. శనివారం 1000 మందికి అన్న ప్రసాద వితరణ చేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శేష వస్త్రం, తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం అందించారు.

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారి రమేష్ కుమార్‌రెడ్డి

దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

పట్టణంలోని పలు దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం దాడులు చేసి, తనిఖీలు నిర్వహించారు. ఆటోమొబైల్ షాపులు, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాప్‌లపై తనిఖీలు చేశారు. లీగల్ మెట్రాలజీ అధికారి రమేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, పలు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సక్రమంగా లేని దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దసరాల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బంగారు వీధిలో ఉన్న అమ్మ వారిశాలలో శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి గజలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రవికుమార్ పర్యవేక్షించారు. పార్నపల్లి రోడ్డులో ఉన్న అంకాలమ్మ ఆలయంలో అమ్మవారు కూడా గజలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ ప్రసాద్, పరిపాలన అధికారి రమణ ఉన్నారు.

జెసిఎస్ క్లస్టర్ వన్ ఇన్‌ఛార్జిగా కిషోర్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణ జెసిఎస్ క్లస్టర్ వన్ ఇన్‌ఛార్జిగా వైసిపి నాయకులు, కౌన్సిలర్ కిషోర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ తనను ఇన్‌ఛార్జిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. మరింత కష్టపడి పార్టీ అభ్యున్నతి కోసం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

వల్లెపు గంగన్న నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన వల్లెపు గంగన్న (60) కళ్లు ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. శుక్రవారం రాత్రి గంగన్న మరణించడంతో ఆయన భార్య లక్ష్మీదేవి, కుమారుడు చౌడయ్య, కుమార్తె వెంకటలక్షుమ్మ, తమ్ముళ్లు బాల వేంకటేష్, నారాయణ స్వామి, రమణయ్య ఆయన నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని ఇంటికెళ్లి గంగన్న మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి, హైదరాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

గంగన్న (ఫైల్‌ఫొటో)

క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు పోరాడుతాం

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కతోలిక క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం ఆల్ ఇండియా కతోలిక యూనియన్ పోరాడుతుందని నేషనల్ లీగల్ అడ్వైజర్ స్వామినాథన్ వెల్లడించారు. నగరంలోని మరియాపురం ఎంపి ఎస్ ఎస్ ఎస్ కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

పేరు మార్చబడినది

కడప వైయస్సార్ జిల్లా, పులివెందుల మండలం, గ్రామం మరియు పోస్ట్, టిటిడి కళ్యాణ మండపం, చెన్నారెడ్డి కాలనీ డోర్ నెం.1-3-543/6లో కాపురముండు అరవీటి నారాయణరెడ్డి భార్య అరవేటి నీరజ (ఆధార్ నెం. 6821 22906427) అయిన నేను, వివాహం ముందు పొట్టేటి వెంకటసుబ్బమ్మగా పిలువ బడినాను. అయితే నేను నా పేరును వివాహం జరిగిన తర్వాత అరవీటి నీరజగా మార్చుకొన్నాను. అప్పటినుంచి నేను అరవీటి నీరజగా పిలువబడుతున్నాను.